పెళ్ళి వారిచేత రైల్వేవాళ్ళు. ఈ సంగతులన్నీ రాస్తే వాళ్ళ తాతగారు "దానికడుపునో కాయకాస్తే అన్నీ అవే సర్దుకుంటాయి" అన్నార్ట. "కాపరంచేసే పిల్ల యిల్లా బరితెగించిఅస్తమానం పుట్టింటికి పారిపోయివస్తే మాకెంత తలవంపులూ" అని పిల్లాడి తరపున పెద్దవాళ్ళు ఫిర్యాదుచేస్తే "సీజన్ టిక్కెట్టు కొనివ్వండి - అదే చవక. వస్తూపోతూ వుంటుంది. దాని గుబులు తీరాక అదే మానేస్తుంది" అన్నార్ట తాతగారు. తాతగారికి లక్షరూపాయల రొక్కం, మావిడితోటలూ, కొబ్బరితోటలూ, పొలాలూ, దొడ్లూ మస్తుగా వున్నాయట. ఆయనే మనవరాల్ని పెంచి అతి గారంచేసి పాడుచేశాడంటారు. ఆ అమ్మాయి మాత్రం అత్తారింట్లో సింహస్వప్నం. హృదయరాణి కావాలంటే రౌడీరాణిని తెచ్చి అంటగట్టా రేమిటా అని ఆ వరుడు వగచి విలపిస్తూ వుంటాడని అంటారు. వగచి విలపించుటకంటె రౌడీరాణిని వలచి వలపింప మేలురా అని చెప్పాలని వుంటుంది. మామేష్టారి మనవరాలి గురించిన చింకి లెక్చరు యింతటితో సమాప్తం;

# పాతాళభైరవి

మన పెద్దవాళ్ళకి నైంటీనైన్ పర్సంటు పెళ్ళిచేసేదాకా సరదాయేగాని పెళ్ళాడినవాళ్ళ సరదాలు తెలియవు. పుష్కరాలొస్తున్నాయనో, శూన్యమాసవనో, మూఢవనో యిన్నోటి యిబ్బందుల్లో కుర్రజంటలు - అంటే కొత్తగా పెళ్ళయిన వాళ్ళకి ఏ సరదా తీరకుండా సమ్మరొచ్చేస్తే నిమ్మకాయసోడాలు, కొబ్బరి బొండాలు, పెద్ద రసాలు, కూజా నీళ్ళూ, కొత్తపచ్చళ్ళు వాళ్ళ విరహాగ్నిని చల్లార్చగలవా? లేవులేవు. బయట పడుకోండి. బయట పడుకోండి, చల్లగా గాలేస్తుంది గాలేస్తుంది అని పెద్దవాళ్ళు నిర్మోహంగా అంటారుగాని అప్పుడప్పుడే పెళ్ళయినవాళ్ళకు ఈ హితోపదేశాలు, సుభాషితాలు, వెదర్ లెక్చర్లూ తడికమీద నీళ్లు జల్లినట్లే. పెళ్ళయినవాళ్ళకు గదులివ్వకపోవడం (ఆఖరికి అన్నాల్తిన్నాక కడిగిన కిచెనయినా) చెంబివ్వకుండా పాలు పితకమనడం లాటిది. మరింకా రాచిప్పలేకుండా పులుసు కాచమనడంలాటిది. దారం లేకుండా పూలదండ గుచ్చమనడంలాటిది. సమ్మరంటే మనకి భయం కాని కొత్తగా పెళ్ళయిన వాళ్ళకి ఏం భయం? నవయువతీ యువకుల దాంపత్యశోభకు కాలం వంగి సలాం చేస్తుంది. ఆకాశం మంగలాక్షతలు జల్లుతుంది. చందమామ ఫోటోలు తీస్తాడు లవ్ సీన్లని. సృష్టి విలాసాన్ని ప్రకృతి ఎదిరించదు. లేకపోతే మామిడిచెట్టు మీద కోకిల అరుగుమీద కూర్చుని బీడీలు కాల్చుకునేవాళ్ల కోసమా కూస్తూంట. ఎవరికి అవసరమో వారికొరకే.

ఇంట్లో వాళ్ళ నాన్ కోపరేషన్ వలన, ఇమాజినేషన్ లేని పెద్దరికాలవలన ఇంటిబ్బందుల వలన విశ్రమించే సదుపాయం లేక, ఎన్ని లేత హృదయాలు నలిగిపోతున్నాయో ఎవరయినా

ఆలోచించారా? పైగా వెకిలినవ్వులు – యికిలింపులూ. పకపకలూ వికవికలూ; న్యూలీవెడ్స్ 'బెడ్స్' లేక సినిమాల కెళ్తున్నారంటే మనవంతా సిగ్గుతో తల వంచుకోవాలి (రసికతా దారిద్ర్యానికి). ఇక్కడ దెబ్బ తగిలితే, సంసారాలు పచ్చి కుండల్లా విచ్చిపోతాయి. పడకటింటి సౌభాగ్యంలేని కొంపలు పోలీసు బేరక్సుల్లాటివి.

ఈ ఉపోద్ఘాతం ఎందుకిచ్చానంటే – మా పక్కింట్లో ఓ ముసలమ్మా, కొత్తగా పెళ్ళయిన జంట వచ్చి చేరారు. ఇంకా లేత జంటే, చెక్కులమీద చూపులు జారి పోవడం, ఆ అబ్బాయి ముఖం పెళ్ళాన్ని చూడగానే వెయ్యి కాండిల్సు దీపంలా వెలిగిపోవడం, ఆ నడకలూ ఆ వయ్యారాలూ ఎవరికైనా యిట్టే అర్థమవుతాయి ఆ ముసలమ్మగారికి తప్ప. వాళ్ళున్న వాటా ఓ వంటిల్లూ, ఓ గదీ, ఓ వసారా, ముసలమ్మగారికి ఆరుబయట పడదుట – మధ్యగది ఆక్రమించుగుని లేవదు. పిల్లల్ని వసారాలో విశ్రమించమంటుంది. ఇది నిత్య ప్రాబ్లెం. పైగా ఆ మామ్మగారు కోపిష్ఠి. అధ్యాత్మరామాయణ కీర్తనలూ, భజగోవిందాలూ, లక్ష్మణస్వామి నిద్ర, సీత సమర్త, గోవింద నామాలూ పాడుతూ వుంటుంది. ముసలమ్మగారి దగ్గర బ్యాంకులో ఫిక్సెడ్ డిపాజిట్లు పదివేలూ, లాకర్లో జప్వారీ, చిన్న కొబ్బరితోటా, ఐదెకరాల సుక్షేత్రమైన మాగాణీగట్రా వున్నాయ్. చక్కగా మనవడి తిండి విషయంలో లోపం లేకుండా తనే వండి పారేస్తుంది. కాని ఆ పైన ఆలోచించే శక్తిలేదు. ఆవిడదీ అంతులేని ప్రేమ. మనవరాల్ని గాజు బొమ్మలా చూసుకుంటుంది. అంతమాత్రంచేత వాళ్ళు ఆగుతారా? ఆగలేరు. మహాగట్టి చిక్కొచ్చిపడి పోయింది ఆ హనీమునీశ్వరులకు. ఇదిలావుండగా – ఓ రోజు ముసలమ్మ గారు మా యింటికొచ్చి పెద్ద తగూ పెట్టింది. తగూ ఏవిటంటే పేపరు చూసి చెప్పమంది పాతాళభైరవి ఆడుతోందా లేదా అని. ఎక్కడా ఆడటంలేదని చెప్దామనుకుంటూండగా, ముసలమ్మగారి వెనక్కాల నుంచి పెళ్ళికూతురు చేతులూపుతోంది ఆడుతోందని చెప్పమని, ఎందుకొచ్చిన పాపం పిల్లి బ్రహ్మహత్యఅని. 'పాతాళభైరవి' ఆడుతోందని ఆ హనీ మునికన్య కోరినట్లు అబద్ధం చెప్పా, రామాయణంలో పిడకల వేటలా ఈ పాతాళభైరవి గొడవ ఏమిటా అని ఆశ్చర్యపోయాను.

తరవాత్తెలిసింది ఏవిటంటే ముసలమ్మ గారు ఎంత ఆర్థడాక్సు సనాతనిస్ట్ వగైరా అయినా ఆవిడకు 'పాతాళభైరవి' సినిమా అంటే తెగ పిచ్చిట. ఈ పాటికి మీకు ఇందులోని మిస్టరీ బోధపడి వుండాలి. ఆ పిల్లా పిల్లాడూ కూడబలుక్కుని ముసలమ్మగారిని రోజూ రిక్షా ఎక్కించి 'పాతాళభైరవి' ఆడుతోంది. ఏదో సినిమా హాలుకి ఎన్.టి.రామారావు బొమ్మవున్న హాల్లో దిగబెట్టి వస్తున్నారట. ఆ ముసలమ్మగారు 'పాతాళభైరవి' కాక ఆ మరో సినిమాలో అధ్వాన్నపుపాటలూ డాన్సులూ చూళ్ళేక, డబ్బు పోశాం కదా అని మానుకోలేక, నానా చిరాకూ పడిపోయి యింటి కొచ్చి మనవడ్నీ మనవరాల్నీ తిట్టిపోస్తున్నార్ట. అయితే యీ డ్రామా యిలా ఎంత కాలం పాపం అని మీరు అడుగుతున్నారా?

"పాతాళభైరవి" సినిమా అయితే ఆ దంపతుల సహకారార్థం, లోక కళ్యాణార్థం "పాతాళభైరవి" తెప్పించి ఆడిస్తే - ఓ మనవడో, మనవరాలో పుట్టేదాకా వాళ్ళకా సరదా తీరుతుంది. ఇదీ ఓ పియా కా ఘర్ స్టోరీయేనా అంటున్నారా?

అవును. ఇదీ ఓ "పాతాళభైరవి" కథే; పాతకథే అంటారా? పాతకథలే బావుంటాయంటున్నారు కద!

# ఇల్లరికమ్స్

'ఇల్లరికంలో వున్న మజా, అది అనుభవించితే తెలియునులే' అని రమణారెడ్డిగారో ఎవరో పాడారు పూర్వం ఆ పేరిట వచ్చిన ఓ పాత సినిమాలో. నిజంగా ఇల్లరికంలో మజా వుందో, లేదో మనకైతే తెలీదుగాని 'సుఖం' మాత్రం హుళక్కి -

అత్తారింటికి తోవేదంటే - పప్పెట్టి, నెయ్యేసి, బువ్వెట్టి, చారోసి, అత్తారింటికి తోవేదంటే అని కితకితలు పెడతారు పిల్లల ఆటల్లో... అత్తారింటికెళ్ళే తోవ ఆడపిల్ల కంత సుఖమైందీ, ఈజీగా వుండేది కాదు.

...మోచేతి మీద దెబ్బలాటిదే కాపురం! కాని, మగాళ్ళకి అత్తారిల్లు మూడ్రోజులుంటే టెంపరరీ హెవెన్ - ఆ తర్వాత కాదు. సుగాత్రీ శాలీనుల కథ చూడండి. అందాకా ఎందుకు గుండమ్మ కథ తీస్కోండి. ఆడపిల్ల కాపరానికి అత్తవారింటికెళ్ళాలి. అల్లాగాక మగ పిల్లవాడే అత్తారింటికి వస్తే - కథ అడ్డంగా తిరుగుతుంది. తనతోపాటు తనవాళ్ళ స్టేటస్ కూడా తత్తుల్యంగా వుంటుంది. మగపిల్లల్లేక ఆస్తి వుండి ఆడపిల్లని వదులుకోలేనివాళ్లు, గారాబంగా పెరిగి పుట్టిల్లు వదల్లేని వాళ్ళు ఆస్తి, డబ్బు ఎరచూపి పిల్లడ్ని ఇంటికి తెచ్చుకుంటారు. అలాటి అల్లుళ్ళు అత్తారింట్లో 'సెకండ్ రేటు సిటిజన్సు' కింద మారిపోవాల్సి వస్తుంది. అత్తగారు రిచ్ యంగ్విడో అయితే అల్లుడికి మరో 'ఎక్స్ట్రా కాన్సిట్యూషనల్ అథారిటీ' పురుష రూపంలో సాక్షాత్కరిస్తుంది. పెళ్ళికూతురు తల్లి పక్షమే అయితే ఆ బాలాకుమారుడి పాట్లు గుర్రపెత్తులో పడ్డ 'రాజు-మంత్రి' పని అవుతుంది. ఆడపిల్లకు తల్లి దగ్గర గారాం అయితే కథ ఓలాగ, తండ్రి దగ్గర గారాం అయితే మరోలాగ, తండ్రి లేనిదయితే మరోలాగ, తల్లి లేనిదయితే వుంకోలాగ వుంటుంది. కిరాతార్జునీయం రాసిన 'భారవి' ఇల్లరికం వెళ్ళాడు. ఎందుకు వెళ్ళాడయ్యా అంటే వూరికే సరదాకు వెళ్ళలేదు. తన్ను గొప్ప కవి అని అంతా మెచ్చుకుంటూ వుంటే తండ్రి మాత్రం 'ఏదో కుర్ర కుంక' అన్నట్లు మెచ్చుకునేవాడు కాడుట. అందుకు కినిసి, తండ్రికి తన మీద జెలసీ అని కోపగించుకుని, తనను మెచ్చుకోకుండా తీసిపారేసే ఫాదర్ని ఖతం చేద్దామని ఓ రాత్రి అటకెక్కి కూర్చుని - రుబ్బురోలు పత్రం అన్నం తింటున్న లేదా